ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 • కనిష్ఠం 21.3



నిర్మల్ జిల్లా వార్తలు

శనివారం 2 నవంబరు 2024

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

● బీసీ సంఘం నాయకులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించ తల పెట్టిన కుల, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమగ్ర సర్వేలో పెద్దఎత్తున బీసీ కులాలు పాల్గొని వివరాలు నమోదు చేయించుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు యూ.కృష్ణంరాజు, ఎంబడి రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెరిగితే అన్ని రంగాల్లో ప్రయోజనం పొందవచ్చు అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గిరి పల్లెలకు.. మహర్దశ!



● త్రీ ఫేస్ కరెంట్ లేని జంగుగూడ గ్రామం

- మారుమూల గిరి పల్లెలకు పీఎం జుగా ఓ వరం!
- మౌలిక సౌకర్యాల కల్పనే కేంద్రం లక్ష్యం
- సర్కారు సహాయంతో పథకం అమలు
- జిల్లాలోని మారుమూల 45 గ్రామ పంచాయతీలకు విద్యుత్ సౌకర్యం
- పెంబి మండలంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

నిర్మల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మారుమూల గిరిజన పల్లెల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించేందు కోసం అమలు చేయ తలపెట్టిన పీఎం జుగా (ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్) గిరిపుత్రులకు వరం కాబోతోంది. ఈ పథకం కింద తాగునీటి సౌకర్యం, గృహనిర్మాణం, పారిశుధ్యం, విద్యుద్దీకరణ, విద్యా, వైద్యం, పోషకాహారం, టెలికాం సేవలు, జీవన వైవిధ్యం లాంటి రంగాలను ఈ గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టబోతున్నారు. పీఎం జుగా కింద కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయనున్న కారణంగా ఇక ఈ పథకం గిరిజన పల్లెలకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూర్చనుందని అంటున్నారు. గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో అంచనాలను తయారు చేయనున్నారు. అయితే ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో ఇప్పటి వరకు కరెంటు సౌకర్యం లేని గ్రామాలపైనే దృష్టి కేంద్రీకరించబోతున్నారు. జిల్లాలో మూడు గ్రామాలకు ఇప్పటి వరకు కనీస విద్యుత్ సౌకర్యం కూడా లేకపోగా మరో పదకొండు గ్రామాలకు త్రీ ఫేజ్ సౌకర్యం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. అలాగే చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని మారుమూల గిరిజన ప్రజలు కరెంటు సౌకర్యం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినప్పటికి ఫలితం లేకుండాపోయిందని అంటున్నారు. అయితే పీఎం జుగా పథకం అమలుకాబోతున్నందున ఇక్కడి విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా అప్రమత్తమై ఈ పథకం అవసరమయ్యే గ్రామాలను ఎంపిక చేశారు. మొత్తం 43 గిరిజన గ్రామాలను పీఎం జుగా పథకం కింద ఎంపిక చేసి ఆ గ్రామాల్లో మొదట విద్యుత్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. పీఎం జుగా పథకం కింద చేపట్టనున్న పనులకు అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి కాదంటున్నారు. దీంతో పనులకు ఇక క్షేత్రస్థాయిలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడవని అంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్ తీసుకోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడం.. అలాగే కరెంటును సరఫరా చేయడం లాంటి అంశాలు కీలకంకానున్నాయి. మొత్తానికి పీఎం జుగా పథకం జిల్లాలోని గిరిజన గ్రామాలకు వెలుగులు నింపనుందని అంటున్నారు.



● మారుమూల సోముగూడ గ్రామం ఇదే..



● దీపాల కాంతుల్లో పనులు చేసుకుంటున్న గిరిజనులు

45 గిరిజన గ్రామాల ఎంపిక

జిల్లాలో పీఎం జుగా పథకం కింద 45 గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు నివేదించారు. కడెం మండలంలోని గంగాపూర్, మిద్దచింత, పెంబి మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్, ఇటిక్యాల్, మందపెల్లి, పస్పుల్లా, పెంబి, దొంధరి, కొసగుట్ట, శేట్‌పెల్లి, వస్‌పల్లి, వెంకం పోచంపాడ్, పెద్దరేగ దుబ్బ, దిలావర్‌పూర్ మండలంలోని మాలేగాం, అంజని తండా, మామడ మండలంలోని గాయిద్‌పెల్లి, రాశిమెట్ల, కప్పన్ పెల్లి, కిషన్‌రావుపేట్, లింగాపూర్, రాయధారి, తాండ్ర, నిర్మల్ రూరల్ మండలంలోని రాణాపూర్, సారంగాపూర్ మండలంలోని కుప్టి, పోట్యా, నాగాపూర్, నర్సాపూర్(జి) మండలంలోని బూరుగుపెల్లి, కుభీర్ మండలంలోని డోడర్న, శివిని, బ్రహ్మేశ్వర్, మార్లగొండ, రంజని, సిర్‌పెల్లి, తానూర్ మండలంలోని మసల్గా, కోలూర్ తండా, జరితండా, లోకేశ్వరం మండలంలోని నర్సింహ నగర్ తండా, సేవాలాల్ తండా, ముథోల్‌లోని విఠోలి తండా, ఎడ్‌బిడ్ తండా, కుంటాల మండలంలోని అంబకంటి తండా, దౌనెల్లి, బూరుగుపెల్లి తండా గ్రామాలను పీఎం జుగా కింద ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లోని కొన్ని తాండాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. అలాగే ఎల్‌టీ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు లాంటి సౌకర్యాలు కల్పించనున్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంటు సైతం ఏర్పాటు

కాగా, జిల్లాలోని గిరిజన ఆవాసాల్లో ప్రస్తుత విద్యుత్ సరఫరాలకు ప్రత్యామ్నాయం గా సోలార్ విద్యుత్‌ను కూడా అందించేందుకు చర్యలు తీసుకోబోతున్నారు. పీఎం జుగా పథకం కింద అవసరమైన చోట్ల సోలార్ విద్యుత్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మొదట పెంబి మండలంలోని రాగిదుబ్బ గ్రామానికి సోలార్ విద్యుత్‌ను అందించాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగానే ప్రతిపాదనలు సైతం రూపొందించారు. ఇప్పటికే పీఎం జుగా పథకం కింద ఎంపిక చేసే గిరిజన గ్రామాలకు సంబంధించి సర్వే నివేదికలు కూడా రూపొందించారు. ఈ నివేదికలను రాష్ట్ర సర్కారు ద్వారా కేంద్రానికి పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కరెంటు సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు

: నాగరాజు, డీఈ, ఎన్‌పీడీసీఎల్, నిర్మల్



జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు పీఎం జుగా పథకం పెద్దఎత్తున ప్రయోజనం చేకూర్చబోతోంది. ఇందులో భాగంగానే ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో మొత్తం 43 గిరిజన గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించడమే కాకుండా మరమత్తులు, అదనపు సౌకర్యాల కల్పన లాంటి పనులను చేపడుతున్నాం. ఎల్‌టీ లైన్‌ల ఏర్పాటు, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు లాంటి పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించాం. ఈ పథకం కింద చేపట్టే పనులకు అనుమతులు సరళీకృతంగా ఉంటాయి. దీంతో పనులకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు.

జాతీయ సమైక్యతకు పునరంకితం కావాలి

● ఎస్పీ జానకి షర్మిల ● నిర్మల్‌లో ఏక్తా దివస్ ర్యాలీ



ఏక్తా దివస్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ జాతీయ సమైక్యతకు పునరంకితం కావాలని ఎస్పీ జానకిషర్మిల పిలుపునిచ్చారు. గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులతో ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించి వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... పోరాటమే ఊపిరిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైందన్నారు. దేశ సమగ్రత కోసం కృషిచేసి యావత్ ప్రజలందరినీ ఏకం చేసిన మహనీయుడు పటేల్ అని కొనియాడారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనిస్ అలీ, ఇన్స్‌పెక్టర్లు నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రేమ్‌కుమార్, రామకృష్ణ, రమణారావు, రవీందర్, ఆర్‌ఐలు, ఎస్సైలు లింబాద్రి, సం దీప్, కే.రాజేశ్వర్, హన్మాండ్లు, సుమలత, జ్యోతిమణి, సుమాంజలి, సాగర్, గోపి, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

సారంగాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలి(బీ)లో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ అంశాలపై కులసర్వే నిర్వహణ కోసం అధికారులు ఇంటింటా అవగాహన కల్పిస్తున్నటువంటి సర్వేను పరిశీలించి, సమగ్ర సర్వేలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సర్వే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ అంశాలను సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇళ్ల వివరాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి నిర్ణీత ప్రొఫార్మాలో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలన్నారు. సర్వే నిర్వహణలో సమయపాలన, ఖచ్చితత్వం పాటించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సర్వేను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రణాళిక అధికారి తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, అధికారులు, సిబ్బందిలున్నారు.

తెలంగాణ సంప్రదాయాలకు పెద్దపీట

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే



సింగాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ (గోండుగూడ) గ్రామంలో నిర్వహించిన దండారి సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ... ఆదివాసి సాంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందజేసేలా ఆదివాసి కులపెద్దలు, యువత చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఆదివాసీలకు నిరంతరం అండగా ఉంటారన్నారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సాంప్రదాయాలను గౌరవిస్తుందన్నారు. అందులో భాగంగానే దండారి ఉత్సవాలకు సైతం ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివాసి కుల పెద్దలకు అందజేశారు. అనంతరం ఆదివాసీల సాంప్రదాయ నృత్యాలలో ఎమ్మెల్యే బొజ్జు పాల్గొన్నారు. తమ సాంప్రదాయ వేషధారణలో నృత్యాలు చేస్తున్న గుస్సాడీలతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేసి అందరినీ మంత్ర ముగ్దుల్ని చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, డీటీడీవో అంబాజీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ, జిల్లా నాయకులు యూసుఫ్ ఖాన్, లక్ష్మీపతి గౌడ్, చిన్నం రవి, పెందూర్ మాధవ్, అర్జున్, శేషాద్రి, బి. రాజేందర్, షౌకత్ పాషా, ఖాజా, సోమిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్యాల రత్నాకర్ రావు, ఆదివాసి కుల పెద్దలు, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్‌కు వినతి

నిర్మల్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ... వాతావరణంలో మార్పు చోటుచేసు కుంటుందని అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయే అవ కాశం ఉందని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని విన్నవించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్‌తో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు వేగవంతంగా ప్రారం భించాలని ఆదేశించారు. ఇందులో మార్కెట్ కమి టీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మామడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన నిర్మల్ జిల్లా మామడ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మామడ మండల కేంద్రానికి చెందిన రెడ్డి చిన్న భీమన్న(46) అనే రైతు తన పంట చేనులో గల పసుపు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లగా తెగిపోయిన సర్వీస్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కాగా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం పంట చేనుకు వెళ్లి పరిశీలించగా ఆయన విగతజీవిగా కనిపించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వ్యవసాయ మోటార్‌కు విద్యుత్ సౌకర్యం దూరంగా ఉండడంతో స్తంభాలు, వైర్ ఏర్పాటు చేయాలని రైతు గతంలో విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. అధికారులు స్తంభాలు ఏర్పాటు చేసి వైర్ లాగకపోవడంతో రైతు సర్వీస్ వైర్ ద్వారా మోటార్‌కు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వైర్ తెగిపడడం వల్లనే ప్రమాదం జరిగిందని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలైందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు పెళ్లి ఈడుకు వచ్చిన ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని, కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుంబ సభ్యుల రోధన అక్కడి వారిని కలచివేసింది. సంబంధిత అధికారులు రెడ్డి చిన్న భీమన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామడ ఎస్సై సందీప్ తెలిపారు.



సంఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహం పరిశీలిస్తున్న ఎస్సై

సంక్షిప్త సమాచారం

జిల్లా కేంద్రంలో భారీ వర్షం



వర్షానికి జలమయమైన ప్రధాన రహదారి

నిర్మల్‌కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆ సమయంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. అనుకోకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం కూడా కొందరు లక్ష్మీ పూజలు నిర్వహించగా వర్షంతో పలు ఆటంకాలు ఎదురయ్యాయి.

వైభవంగా లక్ష్మీదేవి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో శుక్రవారం దీపావళి వేడుకల్లో భాగంగా లక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో అనందోత్సాహాల మధ్య వైభవోపేతంగా నిర్వహించుకున్నారు. కన్నుల పండువగా జరిగిన వేడుకలను భక్తులు సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ పర్వదిన వేడుకలలో అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. దీపాల వెలుగు, జిలుగుల్లో పట్టణం కొత్త శోభను సంతరించుకొని దేదీప్యమానంగా వెలిగి పోయింది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కలిసిమెలిసి ఉత్సాహంగా టపాసులు కాల్చుతూ ఆనందంగా పండుగ వేడుకలను జరు పుకున్నారు. వ్యాపారస్తులు తమ తమ సంస్థల ను లక్ష్మీదేవి పూజల కోసం శోభాయమానంగా ఆరటి చెట్లతో, మామిడి తోరణాలతో, విద్యుత్ దీపాలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. కుటుంబ సభ్యులతో వ్యాపార సంస్థలో పూజలు నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ నిర్వహించబడిన వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. పలు వ్యాపార సంస్థల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

చైర్మన్ ఈశ్వర్‌ను కలిసిన కమిషనర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

నిర్మల్‌కల్చరల్, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖమర్ అహ్మద్ శుక్రవారం చైర్మన్ ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. కమిషనర్‌కు ఈశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు.

పులి దాడిలో కోడె దూడ మృతి

కుంటాల, నవంబర్, 1: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యాపూర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన పులిదాడిలో గ్రామానికిచెందిన కుంచెపు సాయన్నకు చెందిన కోడె దూడ మృతిచెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. సూర్యాపూర్ గ్రామంలో ప్రతిరోజు కుంచెపు సాయన్న పశువుల కాపరిగా వెళుతుంటాడు. శుక్రవారం ఆయన ఆరోగ్యం బాగా లేకపోవడంతో శాల హన్మంతును పశువుల కాపరిగా పంపాడు. అతడు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో పశువులు మేపుతున్న సమయంలో లేగ దూడ గాండ్రింపు వినిపించింది. దీంతో అటువైపు వెళ్లి చూడగా లేగ దూడపై పులి దాడిచేస్తుండడాన్ని గమనించిన ఆయన చెట్టుఎక్కాడు. అతడిని గమనించిన పులి చెట్టు చుట్టూ గాండ్రిస్తూ తిరిగింది. అతడు కేకలువేయడంతో అక్కడి నుంచి వెళుతూ పులి సబ్బన్ లక్ష్మన్ ఆవుపై దాడి చేసింది. గ్రామస్తులు ఒక్కసారిగా అరుపులు కేకలు వేస్తూ అటువైపు వెళ్లడంతో పులి అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయింది.

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి

భైంసారూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాగులో ప్రమాదవశాత్తు కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన భైంసా మండలంలోని దేగాం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... సోనేగార్ చిన్నన్న గత నెల 29న పంట పొలాలకు మందుల కోసం భైంసా వెళ్తానని చెప్పి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ కనిపించ లేదు. గత నెల 31వ తేదీన దేగాం వాగులో నీటిలో తేలడంతో గ్రామ ప్రజలు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి చేపలు పట్టే అలవాటు ఉండడంతో నీటిలో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమా దవశాత్తు కాలుజారి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడున్నారు.

చెరువులో పడి మరొకరు..

నర్సాపూర్(జీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన శివనోళ్ల భావేష్(35) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే మృతుడికి గత ఆరుసంవత్సరాల క్రితం పెళ్లి అయింది. ఇప్పటి వరకు సంతానం కాలేదు. దీంతో మద్యానికి అలవాటు పడ్డాడు. అతని అమ్మా నాన్న కూడా గతంలోనే చనిపోయాడు. మృతుడు ప్రతిరోజులాగే కాలకృత్యాలు తీర్చుకోవడానికి గురువారం సాయంత్రం రాంపూర్ గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి ఎర్రకుంట చెరువులో పడి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం రాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు కాలకృత్యాలకు వెళ్లగా చెరువులో భావేష్ మృతదేహం నీటిలో కనిపించింది. ఈ మేరకు ఎస్సై హన్మాండ్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వివాహిత అదృశ్యం

భైంసా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వివాహిత ఒకరు అదృశ్యమైన ఘటనపై టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు భైంసా టౌన్ ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన కథనం ప్రకారం.... వివరాలు ఇలా ఉన్నాయి. కుబీర్ మండలంలోని చాతా గ్రామానికి చెందిన గిరి ప్రతీక్ష(24)తన చిన్నారి కూతురును వెంటపెట్టుకొని గురువారం దీపావళి పర్వదిన వేడుకల సామగ్రి కొనుగోలు నిమిత్తం భైంసా పట్టణ మార్కెట్‌కు వచ్చింది. పట్టణ పరిధిలోని ఒక వ్యాపార సంస్థలో పనిచేసే తన భర్త గిరి హరికృష్ణ వద్దకు వచ్చి సామగ్రి కొనుగోలు నిమిత్తం డబ్బులు తీసుకొని మార్కెట్‌కు వెళ్లింది. అనంతరం భర్తను కలిసి చాతా గ్రామానికి తిరిగి వెళుతున్నట్లుగా చెప్పి బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి చాతాకు రాత్రి వేళ వరకు ఇంటికి రాలేదు. దీంతో గిరి హరికృష్ణ తన భార్య గిరి ప్రతీక్ష, చిన్నారి కూతురు అచూకి కోసం తీవ్రంగా గాలించారు. అయినప్పటికి అమే జాడ తెలియ రాకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం వేళలో భైంసా టౌన్ పోలీసు స్టేషన్‌లతో తన భార్య అదృశ్యమైనట్లుగాగా ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ఎస్‌ఐ మహ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు ప్రారంబించారు.

కులగణన సర్వే చేయలేము

● సీడీపీవోకు మెమోరాండం అందజేసిన అంగన్‌వాడీలు



సీడీపీవోకు మెమోరాండం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నర్సాపూర్(జీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు కులగణన సర్వేలు చేయలేమని, మినహాయింపు ఇవ్వాలని శుక్రవారం సీడీపీవోకు జిల్లా కార్యాలయంలో మెమోరాండం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, జిల్లా సహాయ కార్యదర్శి గంగామణి, బి. ప్రసాద, విజయ, సునీత, భూలక్ష్మి, అమూర్త, శారదా, పుష్ప, కవిత, రత్నమాల, కమల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగారాం పాల్గొన్నారు.

వడ్ల తూకం వెంటనే చేయాలి

నర్సాపూర్(జి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అకాల వర్షంతో చేతికివచ్చిన వరి పంట తడిసిపోతుంటే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పొగమంచు రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్లు అందించకపోవడంతో రైతులు నానాకష్టాలు పడుతున్నారు. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన రైతులు వరి కొనుగోలు కేంద్రానికి వరి పంటను కోసి తీసుకువచ్చి 12 రోజులు గడిచినా తూకం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక కలిగిన రైస్ మిల్లులు ఉన్నాయి. అటువంటి రైస్‌మిల్లులకు వడ్లను పంపిస్తే సమస్య తీరుస్తుందని రైతులు కోరుతున్నారు. తేమ శాతం పేరుతో నిర్వాహకుడు తూకం వేయకపోవడంతో వడ్లు తడిసే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే తూకం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వడ్లు తూకం వేసిన 24 గంటల లోపు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతులు అంటున్నారు.

కాస్మోటిక్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం...

ఖానాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి కానుకగా తెలంగాణ రాష్ట్రంలో వసతి గృహాలు, గురుకులాలలో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచడం పట్ల ఖానాపూర్ ఎంజేపీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంజేపీ బాలుర పాఠశాలలో విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఫ్లెక్సీని ప్రదర్శించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సోషియో ఎకానమిక్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు సర్వే మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

దండారి చెక్కుల పంపిణీలో రాజకీయ రగడ



వాగ్వాదానికి దిగిన నేతలు

ఆదిలాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దండారి ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న నగదు సహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు దారి తీసింది. గురువారం బేల మండలంలో ఎమ్మెల్యే పాయలశంకర్ ఆధ్వర్యంలో ఆదివాసీలకు దండారి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లను చేశారు. కాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కల ఫొటోలు లేకుండా బ్యానర్‌ను ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైంది. దీనిపై బేల మండల కాంగ్రెస్ నాయకులు ఫైజుల్లాఖాన్, రూపేష్‌రెడ్డి, సంజయ్‌గుండావార్ తదితరులు అధికారులను నిలదీయడంతో అక్కడే ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టడం సరైంది కాదంటూ కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

కొత్త గ్రామ పంచాయతీ ప్రకటించకపోతే ఎన్నికల బహిష్కరణ

● టోకిగూడ, షేర్‌గూడ గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న టొక్కిగూడ గ్రామ పటేల్ జనక్

తలమడుగు నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తలమ డుగు మండలం ఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని టొక్కిగూడ, షేర్‌గూడ ఆదివాసి, గిరిజనులు కొత్త గ్రామ పంచాయితీ ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివాసి గిరిజనులు మాట్లాడుతూ తలమడుగు మండలం లోని ఝరి గ్రామ పంచాయితీలో గతంలో ఉండగా ప్రస్తుతం పున్నగూడ గ్రామ పంచాయితీని ఏర్పాటు చేయగా అందులో రెండు గ్రామాలకు కలపడంతో వారికి దూర భారం ఎక్కువ అవుతుందన్నారు. పున్నగూడ గ్రామ పంచాయితీకి వెళ్లాలంటే కనీసం ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. దీని వల్ల అభివృద్ధికి దూరమవడమే కాకుండా పని భారం పెరుగుతుందన్నారు. టోకిగూడ,షేర్‌గూడ రెండు గ్రామాల్లో దాదాపు 1200 మంది జనాభా ఉన్నారని, 500 పైగా ఓటర్లు ఉన్నారని, ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోకుండా అధికారుల ఇష్టారాజ్యంతో మా రెండు గ్రామాలను పున్నగూడ గ్రామ పంచాయితీలో కలిపారన్నారు. వెంటనే అధికారులు స్పందించి రెండు గ్రామాలను కలిపి నూతన గ్రామ పంచాయితీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే గ్రామ పంచాయితీ ఎన్నికలను ఓటు వేయకుండా బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గ్రామాల పెద్దలు పటేల్ మాజన్, మాజీ సర్పంచ్ సిడం జనక్‌పటేల్, పెందూర్ సాకారం పటేల్, సిదం లక్ష్మీమన్ పెందూర్ హనుమంతు, కోసేరావు, జలపత్, జైవంత్‌రావు, చంద్రభాన్, సురేష్, భీమ్‌రావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి క్రెడిట్ దక్కకుండా ఎమ్మెల్యే కుట్ర

● అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : బేల మండల కేంద్రంలో దండారి చెక్కుల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లి ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి తప్పుబట్టారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న చెక్కుల పంపిణీలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలు బ్యానర్‌లో లేకుండా ఎలా పంపిణీ చేస్తారని ఆయన మండిపడారు. ఇదే విషయాన్ని మండల కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తే బ్యానర్ పెట్టం ఎవరి చెప్పుకుంటారో చెప్పుకోండి అని సదరు అధికారి మాట్లాడడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే పాలయశంకర్ అండదండలు చూసుకుని అధికారులు ప్రభుత్వ పథకాల విషయంలో ప్రభుత్వానికి క్రెడిట్ దక్కకుండా కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

దండారి ఉత్సవాల్లో పాల్గొన్న కంది

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదివాసుల చెంతకు వెళ్లి దండారి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. దీపావళి పండగకు ముందు ఆదివాసులు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే దండారి సంబరాలకు హాజరై వారికి కానుకలు అందజేస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ, మత్తడిగూడ, రాములుగూడ, మావల మండలంలోని వాఘపూర్, కొలాంగూడ గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులు డప్పు చప్పుళ్ల ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవి

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్‌లో ఏర్పాటు చేసిన దండారి ఉత్సవాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆదివాసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దండారి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి దండారి బృందాలు సందర్శిస్తూ సంస్కృతిని కాపాడుతున్నారన్నారు. ఇప్పటికి కూడా ఆదివాసుల అనేక సమస్యలతో సతమవుతాం అవుతున్నారన్నారు. ఆదివాసుల సమస్యల పరిష్కారానికి తన వద్ద కృషి చేస్తానని పేర్కొన్నారు. త్వరలో ఆదివాసుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటానని పేర్కొన్నారు. ప్రతి ఆదివాసీ పొలాల్లో బోర్లు ఉండేలా కార్యచరణ తీసుకుంటామన్నారు. వ్యవసాయం చేయడానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రుణమాఫీ రాని వారికి వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్ దయాకర్, ఆదినాథ్, మహేష్, మయూర్ చంద్ర, నాగోరావ్, డెవలప్ ముకుందరావ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్ కుటుంబ సమేతంగా లక్ష్మిపూజ నిర్వహించారు. కుటుంబీకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో పర్యటిస్తూ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నార్నూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు బిక్కురాథోడ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ యేడాది వర్షకాలం ప్రారంభం నుంచి భారీగా వర్షాలు ఉన్నాయన్నారు. ప్రాంత రైతులకు సరైన రీతిలో రుణమాఫీ కూడా కాలేదన్నారు. చాలా మంది రైతులు ఇప్పటికి కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని, వారిని ఆదుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వినియోగించుకోండి

● ఎమ్మెల్యే రామరావు పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామరావు

కుంటాల, నవంబర్ 1 : (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఇట్టి కే ంద్రాలను రైతులు సద్వినియోగం చేసోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ అన్నారు. శుక్రవారం కల్లూరు గ్రామంలో డీసీఎంస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు మొదటి రకానికి రూ. 2320, రెండవ రకానికి రూ. 2300 ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రమణ రావు, అప్క గజ్జారాం యాదవ్, నాయకులు సోలంకి భీంరావు, ఏఈవో గణేష్, స్థానికులు గంగాధర్, లక్ష్మణ్ పటేల్, రజనీకాంత్, నర్సయ్య, పసుల నవీన్, నిర్వాహకులు శివాజీ పటేల్ ఉన్నారు.

నిర్మల్ వాసికి సౌదీ అరేబియాలో అవార్డు



అవార్డు అందుకుంటున్న సయ్యద్ ముజాహిద్ అలీ

నిర్మల్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణానికి చెందిన సయ్యద్ ముజాహిద్ అలీకి శుక్రవారం సౌదీ అరేబియాలోని రియాద్ పట్టణ షాహిన్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తరఫున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. ఇందులో మినిస్ట్రీ ఆఫ్ ఇన్‌చార్జి, డైరెక్టర్ ఖదీర్, అయాజ్ అహ్మద్, తదితరులున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



దీపావళి సంబరాలు

నిర్మల్‌కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం ప్రజలు దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి చిన్న పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చారు. మిత్రులు బంధువులను కలుసుకుని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం మంగళహారతులు తీసుకున్నారు. సాయంత్రం ధనలక్ష్మి పూజలు చేశారు. పట్టణంలోని అన్ని ప్రాం తాల్లో దీపాల వెలుగులతో విరజిమ్మాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ వర్గాలకు చెందిన ప్రముఖులు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.

ఖానాపూర్ : మండలంలో రెండు రోజుల పాటు దీపావళి పర్వ దిన వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని పలు వ్యాపార సముదాయాల్లో, నివాస గృహా ల్లో గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం లక్ష్మీపూజలు నిర్వ హించారు. గురువారం రాత్రి ఖానాపూర్‌లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ తన నివాసంలో లక్ష్మీ పూజలు నిర్వహించి, పట్టణంలోని పలు వ్యాపార సముదాయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం ఖానాపూర్‌లోని పలు వ్యాపార సముదాయాల్లో నిర్వహించిన లక్ష్మీ పూజల కార్యక్రమానికి మాజీ ఏపీపీఎస్సీ సభ్యులు పైడిపల్లి రవీందర్ రావు హాజరయ్యారు. రెండు రోజుల పాటు సాగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. దీపావళి వేడుకల సందర్భంగా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద జనం సం దడి కనిపించింది.

నర్సాపూర్(జి): నూతన మండలంలో గురువారం దీపావళి సంబరాలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఇళ్లు, వ్యాపార సంస్థల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాణాసంచాలు కాలుస్తూ దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి స్వర్ణ చించోలి(ఎం), కౌట్ల(బి), జామ్, బోరిగాంతో పాటు తదితర గ్రామాల్లో గురువారం ఘనంగా దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉదయం ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలను ధరించి ఆలయాల్లో మొక్కులను మొక్కి ఒకరినొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం టపాకాయలను కాల్చారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.

కుంటాల : మండల కేంద్రం కుంటాలతో పాటు ఆయా గ్రామా లలో గురు, శుక్రవారాలు దీపావళి పండుగను ఘనంగా జరుపు కున్నారు. వ్యాపారస్తులు వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజలు నిర్వహించారు. గ్రామాల్లో దీపావళి పండుగతో మారు మ్రోగాయి.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు ఆయా గ్రామా ల్లో దీపావళి వేడుకలు గురువారం అంబరాన్నంటేలా సంబరాలు జరుపుకున్నారు. చెడును త్రోలి మంచి జరగాలని, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని లక్ష్మీ దేవికి పూజచేసి వేడుకున్నారు. వ్యాపారులు తమ వ్యాపారం వృద్ధి చెందాలని లక్ష్మీదేవి చిత్రపటాలకు పూజలు చేసి మొక్కు కున్నారు. రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

మద్దతుధర కొందరికేనా?

(5వ పేజీ తరువాయి...)

తీసుకుంటున్నారు. ముందుగానే క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన కల్పించి ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తివి కావన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులకు ముందుచూపు లేకపోవడంతో ఏటా పత్తి రైతులు నష్టపోతూనే ఉన్నారు.

● సీసీఐ కఠినమైన నిబంధనలతోనే నష్టం

: కె.కృష్ణారెడ్డి, పొన్నారి, తాంసి మండలం

అష్టకష్టాలు పడి పత్తి పంటను పండిస్తున్న సీసీఐ కఠినమైన నిబంధనలతోనే రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ఒక్క పాయింట్ తేడా ఉన్న సీసీఐ కొనుగోలు చేయడం లేదు. గంటల వ్యవధిలోనే ఒక్క శాతం తేమ మారిపోతుంది. దీంతో రైతులు మద్దతుధరకు నోచుకోవడం లేదు. ప్రతియేటా ప్రభుత్వం మద్దతుధరను నిర్ణయిస్తున్నా.. ఎంత మంది రైతులకు దక్కుతుందో? లెక్కలోకి తీసుకోవడం లేదు. అసలు రైతులకు మద్దతుధర దక్కక పోవడానికి కారణాలు వెతకడం లేదు. అధికారులు రైతుల్లో అవగాహన కల్పిస్తేనే మద్దతు ధర దక్కే అవకాశం ఉంటుంది. రైతులు ఆదరబాదరగా అమ్మేసుకోవడం కూడా మరొక కారణమని చెప్పవచ్చు. సీసీఐ తేమ నిబంధనలను సడలిస్తేనే రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇండ్ల సంఖ్య గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం పరిశీలించారు. రిక్షా కాలనీ, శ్రీరాం కాలనీల్లో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డిప్యూటీ ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాలను దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం టూ టౌన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడ్డ గంగాధర్‌ను స్థానిక క్రాంతినగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి మూడు ద్విచక్రవాహనాలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

సర్వే సిబ్బందికి కిట్లు అందజేత

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సిబ్బందికి కిట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సర్వే సిబ్బందికి కమిషనర్ సీవీఎన్ రాజు, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్పీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నిరసన

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ మున్సిపల్ ఎదుట శుక్రవారం మెప్మా ఆర్పీలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళడంలో పాత్ర పోషిస్తున్న ఆర్పీలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని వాపోయారు. తమకు గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. అనంతరం ఆర్పీలతో మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ఉట్నూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : గరీబ్ హఠావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాం.దీకే దక్కుతుందని గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రంసుగుణక్కలు అన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భం గా గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సుగుణక్ నివాసంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైనథ్ మాజీ జడ్పీటీసీ వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, నాగపూర్ మాజీ సర్పంచ్‌సునిల్‌జాదవ్, సంతోష్ జాదవ్, మహిళ నాయకురాలు రాజవ్వ తదతరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● లక్ష్మణచాంద తాజా మాజీ జడ్పీటీసీ

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సామాజిక, బీసీ కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని లక్ష్మణచాంద తాజా మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కుల గణన త్వరితగతిన పూర్తి చేసి బీసీలకు రాజకీయ పరంగా రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాల నివారణ కోసం పేయింటింగ్

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామం నుంచి వెళ్తున్న లక్ష్మణచాంద మండల్ టు నిర్మల్ జిల్లా కేంద్రం తారు రోడ్డుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం పేయింటింగ్ వేశారు. ఈ రోడ్డుపై ప్రభుత్వ పాఠశాల ముందర స్పీడ్ బ్రేకర్ ఉన్నప్పటికీ పేయింటింగ్ లేనందున కనబడక చాలా మంది వాహన చోదకులు అదుపు తప్పి అనేక ప్రమాదాలకు గురయ్యారు.

గూడెంల సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతుగూడ, కేశవ్‌గూడ, మహదుగూడ గ్రామాలలో శుక్రవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పర్యటించారు. ఆయా గ్రామాలలో గుస్సాడీలు డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతించారు. ఆయా గ్రామాల్లో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని స్థానిక ఎమ్మెల్యేలు అనిల్ సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యువకులు దురలవాట్లకు దూరంగా ఉండాలని కష్టపడి లక్ష్యంతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌యాదవ్, కిషన్, నాయకులు అల్లకొండ ప్రశాంత్, ఇర్ల అభిలాష్, సుధీర్‌రెడ్డి, తుల హరీష్, సోమన్న, భీమ్‌రావు, చిన్నయయ్య, మ్యునాల్లాడ్, ఎఫ్ఏ కార్ గ్రామ పటేళ్ళు, దేవారిలు, మహాజన్ పూజారిలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలపై బహిరంగ లేఖ

బోథ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలో బీఆర్ఎస్ పార్టీలో అవినీతికి పాల్పడ్డ వ్యక్తులకు చోటుకల్పించారని, వారితో మేము పని చేయలేమంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ లేఖను పంపించారు. గతంలో డబుల్ బెడ్ రూమ్‌లో ఇస్తామంటూ లక్షలు వసూలుచేసిన వారికి ఈసారి ఇందిరమ్మ కమిటీలో అవకాశం కల్పించడం సరైంది కాదని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ నిరంతరం పోరాటం

బోథ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఏఐటీ యూసీ ఆవిర్భావ దినోత్సవాలను ఆ పార్టీ నాయ కులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు జిల్లా ప్రధాన కార్యదర్శి గోదావరి జెండాను ఆవిష్కరించారు.

అడ్డగోలుగా ఈ-చలాన్ల బాదుడు!

● ఒకే వాహనానికి రెండుసార్లు జరిమానా ● ఇష్టారాజ్యంగా పోలీసుల ఫైన్లు ● లబోదిబోమంటున్న వాహనదారులు


జర దేఖో!!

పోలీసులు రెండుసార్లు ఫైన్ వేసిన ద్విచక్రవాహనం ఇదే..



ఫైన్ వేసినట్లు చూపుతున్న ఈ-చలాన్

ఆదిలాబాద్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపితే పోలీసులు సంబంధిత వాహన యజమానికి జరిమానా విధించడం అందరికీ తెలిసిందే. కానీ ట్రాపిక్ పోలీసులు అడ్డగోలుగా ఫైన్‌లు బాదడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఓ వాహనదారుడికి రెండు రోజుల వ్యవధిలోనే ఒకే ఈ చలాన్‌ను రెండుసార్లు వేసి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపడంతో విస్మయానికి గురయ్యాడు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వాహనదారుడు అక్టోబరు 29న టీఎస్ 11ఈఎస్4399 తన ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రం నుంచి మావల మండలం వైపు వెళ్తుండగా రాంనగర్ శివాలయం వద్ద హెల్మెట్ లేకుండానే ద్విచక్ర వాహనాన్ని నడిపాడంటూ పోలీసులు ఈ -చలాన్ ద్వారా రూ. 235 జరిమానాను విధించారు. మళ్లీ అదే వాహనానికి ఒకే చోట అవే ఫొటోలతో అదే సమయానికి అక్టోబరు 31న హెల్మెట్ లేకుండా వాహనం నడిపాడంటూ మరోసారి రూ. 235ను జరిమానా విధించారు. కాని అసలు అక్టోబరు 31న ఆ ద్విచక్ర వాహనాన్ని ఇంటి నుంచి బయటకు తీయనే లేదని వాహనదారుడు వాపోతున్నాడు. అయిన తన వాహనానికి రెండుసార్లు పోలీసులు ఈ-చలాన్ వేస్తూ ఫైన్ బాధడం ఏమిటని ప్రశ్నిస్తున్నాడు.అయితే ఈ- చలాన్ పై కొంత అవగాహన ఉన్న వారు మాత్రమే స్మార్ట్ ఫోన్లలో జరిమానా, లోకేషన్‌కు సంబంధించిన వివరాలను చూసుకుంటు పొరపాట్లను తెలుసుకునే అవకాశం ఉంటుంది. కానీ స్మార్ట్‌ఫోన్ లేని మధ్య తరగతి, సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న వాదనలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలుగా అక్రమ ఈ-చలాన్‌లను వేస్తూ జరిమానాలు విధించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఖానాపూర్‌లో బెంబేలెత్తిస్తున్న బైక్ దొంగలు

● 15 రోజుల వ్యవధిలోనే రెండు ద్విచక్ర వాహనాల అపహరణ ● ఆందోళన చెందుతున్న వాహనదారులు

ఖానాపూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ పట్టణంలో బైక్ దొంగలు బెంబేలెత్తిస్తున్నారు. వరుసగా బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే ఖానాపూర్ పట్టణం నడిబొడ్డు నుంచి రెండు ద్విచక్రవాహనాలను అపహరించి తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. గత నెల 16న ఖానాపూర్ సుభాష్‌నగర్ కాలనీలోని అల్లెపు లక్ష్మణ్ టీఎస్ 18డీ 9016 నెంబరు తన ద్విచక్ర వాహనాన్ని పట్టణంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద నిలిపి లోపలికి వెళ్లి వచ్చే సరికి దొంగలు ఎత్తుకెళ్లారు. ఇప్పటివరకు సదరు ద్విచక్ర వాహనం జాడ దొరకకపోవడంతో బాధితుడు ఆందోళన చెందుతున్నాడు.


దీపావళి రోజు ఇంటి ముందు నుంచి దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనం ఇదే (ఫైల్)

దీపావళి రోజు మరో బైకు దొంగతనం

దీపావళి పర్వదిన వేడుకలు ఓవైపు జరుగుతుండగానే మరోవైపు దొంగలు తమ చేతివాటానికి పని చెప్పారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న తన ఇంటి ఎదుట టీఎస్ 18 3203 అనే నెంబర్ గల తన ద్విచక్ర వాహనాన్ని నిలిపిన కొక్కుల రాజలింగు ఇంట్లోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి సదరు ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో గురువారం సాయంత్రం వరకు చుట్టుపక్కల వెతికిన రాజలింగు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఇలా 15 రోజుల వ్యవధిలోనే పట్టణ నడిబొడ్డులోని కాలనీలలో బైక్‌ల దొంగతనం జరగడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బైక్ దొంగలు అదును చూసి దొంగతనాలకు పాల్పడుతూ దొంగలించిన బైక్‌లను దూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటుండడంతోనే తిరిగి సదరు వాహనాల ఆచూకీ దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలసులు పకడ్బందీ నిఘా ఏర్పాటు చేసి ఈ బైక్ దొంగలను పట్టుకొని పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.



గతనెల 16న దొంగతనానికి గురైన బైకు ఇదే (ఫైల్)


రేలా సంబురం

రేలా పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

ఆదివాసీ గ్రామాల్లో

మహిళల రేలా ఉత్సవాలు ప్రారంభం

● సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి: ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్న ఆదివాసీ గిరిజనులు సంస్కృతి సంరక్షణలో భాగంగా మహిళలకు రేలా ఉత్సవాలు నిర్వహించుకునే అవకాశం కల్పించారు. దీపావళి లక్ష్మీపూజలు మరుసటిరోజు నుంచి ఆదివాసీ మహిళలు గిరిజన గ్రామాలలో రేలా ఉత్సవాలను ప్రారంభించారు. ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ, కల్లూరుగూడ, సుద్దగూడ, మారుగూడ, దుర్గాపూర్, టక్కుగూడ తదితర ఆదివాసీ గిరిజన గ్రామాలలో గత కొన్ని రోజులుగా దండారి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దండారి ఉత్సవాలలో గుస్సాడిల దండారితోపాటు డోల్‌కి బృందం, చచోయ (కోలాటం) బృందం, కేల్‌బృందం (హాస్యం)లలో పురుషులు పాల్గొని గ్రామాలలోని మహిళలు రేలా బృందంగా ఏర్పడి దేవుని పాటలను పాడుతూ సామూహిక నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాలు నిర్వహించుకోవడం ప్రారంభించారు. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆదివాసీ గిరిజనులు తమ గ్రామాల్లోని గుస్సాడి దండారి బృందాల వెంట చిన్నారులను కూడా బృందాలలో చేరుచుకుంటున్నారు. పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారులు దీపావళి పండుగకు ఇంటికి రాగానే వారికి కూడా డోల్‌కి బృందం తరహాలోనే తెల్లని వస్త్రాలు ధరింయి కాళ్లకు గజ్జలు కట్టి, చేతుల్లో కోలాలు ఇచ్చి చచోయి బృందాలలో నృత్యాలు నేర్పిస్తున్నారు. కల్లూరిగూడలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చచోచి బృందంలో ఉన్న చిన్నారులతో కలసి ఫొటోలు దిగి వారిని సంతోష పరిచారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుదాం

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్‌తరాలకు అందించాల్సిన అవసరం బాధ్యత మనపై ఎంతైనా ఉందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని చింతకర్ర, మోతిగూడ, కోలాంగూడ(చెరువుగూడ) సుద్దుగూడ, మత్తడిగూడ గ్రామాలలో గురువారం దండారి ఉత్సవాలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్మాసూర్ దేవతలకు పూజలు చేశారు. దండారి ఉత్సవాలకు సంబంధించిన 12 చెక్కులను గ్రామస్థులకు ఒక్కొక్కరికి రూ.15వేల వంతున చెక్కులను పంపిణీ చేశారు. గుస్సాడిలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి పండుగ ఆదివాసులకు ఎంతో ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఎంతో నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో దండారి ఉత్సవాలను తరతరాలుగా నిర్వహించడం అనవాయితీగా వస్తోందని తెలిపారు. ప్రభుత్వం దండారి ఉత్సవాలకు ప్రత్యేకంగా ప్రతీ దండారి బృందానికి రూ.15వేల చెక్కును అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీరెడ్డి, దాసన్న ప్రభాకర్, ఖయ్యుం, దూట రాజేశ్వర్, రాజేశ్‌నాయక్, లింగంపల్లి చంద్రయ్య, మహమ్మద్, ఇక్బాల్, గ్రామస్థులు పాల్గొన్నారు.


కల్లూరిగూడలో దండారి బృందంతో ఎమ్మెల్యే


బృందాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న బొజ్జుపటేల్


భక్తి

ఎంపీ నగేష్‌ను స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సంస్కృతి, సంప్రదాయాలను

భావితరాలకు అందించాలి

● ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు పటేల్, అనిల్ జాదవ్ ● ఉత్సాహంగా దండారి ఉత్సవాలు

ఇంద్రవెల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంస్కృతి ఎంతో గొప్పదని, ఈ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్, మోహన్‌గూడ గ్రామాల్లో గుస్సాడీ, దండారి ఉత్సవాల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గుస్సాడీ నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మాజీఎంపీటీసీ కోవా రాజేశ్వర్ నాయకులు మోరే దిలిప్, కనక తుకారం, మాస్కే రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతినే దైవంగా భావించి పూజలు..

తరతరాలుగా ఆచరిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను మరువొద్దని, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోండుగూడ కాలనీలో దండారి ఉత్సవాల్లో పాల్గొని దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీ సంస్కృతి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని తెలిపారు. ప్రకృతిని దైవంగా భావించి పూజలు చేయడం తరతరాలుగా వస్తున్న అనవాయితని పేర్కొన్నారు. దండారి ఉత్సవాలలో డీజేలు పెట్టొద్దని సూచించారు. అకాడి పండుగ నుంచి మొదలుకొని దీపావళి పండుగ వరకు ఆదివాసీలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ దండారి ఉత్సవాలు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దండారి ఉత్సవాలకు రూ.కోటీ 50 లక్షలు మంజూరు చేసిందని అన్నారు.

ఐటీడీఏ పరిధిలోని వెయ్యి గ్రామాల్లో ప్రతీ దండారికి రూ.15వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. అనంతరం రెండు గ్రామా లకు చెందిన 30 వేల విలువ గల దండారి చెక్కు లను గ్రామస్తులకు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు జుగ్నాక్ భారత్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

గిరిజన సంస్కృతి పవిత్రమైంది

తలమడుగు, నవంబరు1 (ఆంధ్ర జ్యోతి): ఆదివాసుల గిరిజన సంస్కృతి, స ంప్రదాయాలు చాలా పవిత్రమైనవి, వాటిని భావితరాలకు అందించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని చర్లపల్లి గ్రామంలో దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గుస్సాడీలు గ్రామస్తులు దండారి నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసీ గుస్సాడీలకు రూ.15వేల విలువ గల 31 దండారి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసులను వారి సంప్రదాయాన్ని గౌరవించి వారి దండారి పండుగకు రూ.10వేలు అందించాలని నిర్ణయం తీ సుకున్నారని అన్నారు. దండారి పండుగను అందరూ అలయ్ బలాయ్‌గా జరుపుకుంటామని అన్నారు. అదేవిధంగా ఆదివాసుల పిల్లలు చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. దీపావళి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతీ గుస్సాడీ బృందాలకు రూ.20 వేలు: డీసీసీబీ ఛైర్మన్

ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రభుత్వం ముందు ఉందన్నారు. వారిని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదే విధంగా వచ్చే ఏడాది దీపావళికి ప్రతీ గుస్సాడీ బృందానికి రూ.20వేలు అందించేందుకు చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా అభివృద్ధికి దూరంగా ఉన్న బోథ్ నియోజకవర్గం పార్టీలకతీతంగా అభ్భిద్ధి పరిస్థితికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, సహకార సంఘం ఛైర్మన్ శ్రీనిఆస్‌రెడ్డి, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, రమాకాంత్, జనక్‌పటేల్, మహేష్, జిల్లా మహిళా నాయకురాలు కాటిపెల్లి సునీతారెడ్డి, డైరెక్టర్ పెందురు వనమాల సుదర్శన్‌రెడ్డి, కిరణ్, గంగాధర్, ఐటీడీఏ అధికారులతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దండారీ సంబరాలు

మండలంలోని గాజిలి, గాంధారి, తర్నం, వాగ్దారి, మాదాపూర్, కుంటాలబి, నాగమల్యాల్, పీచర, తిమ్మాపూర్, గుత్పల, రేల్ మామడ, యాపల్‌గుడ, కోర్డికల్, లింగట్ల, తదితర గ్రామాల్లో గురువారం దండారి ఉత్సవాలు కొనసాగాయి. ఇతరగ్రామాల నుంచి వచ్చిన గుస్సాడీలకు తమ గ్రామాల్లో ఆతిథ్యం ఇచ్చి విందు భోజనం ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చిన గుస్సాడీలు గ్రామ గుస్సాడీలతో పోటాపోటీగా నృత్యాలు చేస్తు గ్రామస్థులను అలరించారు. గ్రామ పటేల్‌లు,పూజారులు ఈ ఎర్పాట్లను చేపట్టారు. గురు వారం దీపావళి పండుగను పురష్కరించుకుని వివిధ గ్రామాల గుస్సాడీలు బోథ్ ఏమ్మేల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద సందడి చేశారు, గుస్సాడిలు నృత్యాలు చేయడంతో సందడి నెలకోంది ఏమ్మేల్యే అనిల్ జాదవ్ సైతం గు స్సాడిలతో కలిసి గుస్సాడీ టోపీ ధరించి నృత్యాలు చేశారు. అంతకు ముందు మండలంలోని లఖంపూర్ గ్రామంలో దండారీ ఉత్సవాల్లో పాల్గోని గుస్సాడీలకు రూ.15వేల చొప్పున 11 గ్రామాల గ్రామాల దండారీలను చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల నాయకులు రవీందర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, శివారెడ్డి, గులాబ్‌సింగ్, ఆత్రం లక్ష్మన్, రమేష్, సవాయ్‌రామ్, భీముడు, సీతారాం పటేల్, జంగు గ్రామ పేద్దలు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


గుస్సాడీ బృందాలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


అట్టహాసంగా ఎమ్మెల్యే క్యాంప్ వద్ద గుస్సాడీ దండోరా

బోథ్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వపరంగా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నృత్యాలు చేస్తూ గుస్సాడీలు స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల ఆచార వ్యవహారాలు ఎంతో గొప్పవని వారు కట్టుబాట్లకు కట్టుబడి ఉంటారన్నారు. నేటి సమాజానికి ఆదివాసీలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. కాగా ఆదివాసులతో కలిసి మండల పార్టీ కన్వీనర్ నృత్యం చేయడంతో మాజీ జడ్పీటీసీ తాహెర్‌బిన్ సలాం అభినందించారు.


నృత్యాలు చేస్తున్న వెడ్మ బొజ్జు పటేల్


గుస్సాడి టోపీ వేసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బోథ్‌లో గుస్సాడీ నృత్యాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే



అక్టోబరు 26 నుంచి 30 వరకు పత్తి కొనుగోళ్ల వివరాలు

	రైతులు	పత్తి (క్వింటాళ్లలో)
సీసీఐ	382 మంది	7176.28
ప్రైవేట్	1779 మంది	32745.48

తేమ శాతం వారీగా పత్తి ధరలు ఇలా..

8 తేమ శాతం - రూ.7521
9 తేమ శాతం - రూ.7446
10తేమ శాతం - రూ.7371
11 తేమ శాతం - రూ.7296
12 తేమ శాతం - రూ.7221



● మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి బండ్లు

మద్దతు.. కొందరికేనా?

- జిల్లాలో 39వేల 921 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు
- సీసీఐ కొన్నది 7,176 క్వింటాళ్లు కాగా, ప్రైవేట్ కొనుగోళ్లు 32,745
- తేమపై రైతుల్లో అవగాహన కల్పించని అధికారులు
- ఆదరబాదరగా అమ్మేసుకుంటూ నష్టపోతున్న అన్నదాతలు
- తేలికగానే తీసుకుంటున్న అధికార యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు 4లక్షల 34వేల ఎకరాల్లో పత్తి పంట సాగు

ఆదిలాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తికి మద్దతుధర కొందరికే దక్కుతోంది. దీంతో వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, రైతుల్లో అవగాహన లేకపోవడంతో పత్తి రైతులు దగా పడుతున్నారు. ఈ సారి క్వింటాలు పత్తి మద్దతుధర రూ.7521గా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ తేమ పేరిటా భారీగా కోతలు పెడుతు ధరను తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు ఆదరబాదరగానే అమ్మేసుకుంటున్నారు. సీసీఐ కఠినమైన నిబంధనలు పెట్టడంతో జిల్లా రైతులు మద్దతుధరకు నోచుకోవడం లేదు. ఈ యేడు జిల్లావ్యాప్తంగా 4లక్షల 34వేల ఎకరాలలో పత్తి పంట సాగైంది. దీంతో 30లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతనెల అక్టోబరు 25 నుంచి జిల్లాలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. తొలి రోజు గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో 26 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అక్టోబరు 30వరకు జిల్లావ్యాప్తంగా 39వేల 921 క్వింటాళ్ల పత్తిని సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇందులో సీసీఐ 7176.28 క్వింటాళ్లను కొనుగోలు చేయగా.. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం 32వేల 745.48 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. రైతులకు మద్దతుధర దక్కేందు కే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అంతంతమాత్రంగానే కొనుగోళ్లు కనిపిస్తున్నాయి. ఎందుకంటే సీసీఐకి తేమ శాతం నిబంధనలు అడ్డురావడంతో ప్రైవేట్ వ్యాపారులకు కలిసి వస్తుంది. గత్యంతరం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్మేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

56 మంది రైతులకే మద్దతుధర

గత వారం రోజుల క్రితం పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు సీసీఐ, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా ఇప్పటి వరకు 39వేల 921క్వింటాళ్ల పత్తిని 2161 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. కేవలం 56మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన రూ.7521 మద్దతు ధర దక్కినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే 2105 మంది రైతులు మద్దతు ధరను నోచుకోలేదు. 8తేమ శాతం నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఆపై ఒక్కశాతం తేమ అధికంగా ఉన్న సీసీఐ కొనుగోళ్లకు నిరాకరిస్తోంది. దీంతో రైతులు తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తుంది. 8తేమ శాతం ఉన్న పత్తికి మాత్రమే రూ.7521 మద్దతు ధర దక్కుతోంది. ఆపై తేమ ఉంటే ఒక్కో పాయింట్‌కు రూ.75 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. దీంతో 12శాతం తేమ ఉన్న పత్తికి రూ.7221 మద్దతుధర దక్కుతుంది. ఇప్పటి వరకు సీసీఐ 382మంది రైతుల నుంచి మాత్రమే 7176.28 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. అదే ప్రైవేట్ వ్యాపారులు 1779 మంది రైతుల నుంచి 32వేల 745.48 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ప్రైవేట్‌లో కనిష్ఠంగా.. 23 తేమ శాతానికి రూ.6వేల 61 ధర దక్కగా గరిష్ఠంగా.. రూ.7130 ధర దక్కింది. పేరుకే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటిస్తున్న రైతులందరికీ.. మద్దతుధర దక్కక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

ధరల్లో భారీగా కోతలు

సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు తేమ పేరిట భారీగా కోతలు విధిస్తున్నారు. సీసీఐ మద్దతు ధరలో ఒక్కో పాయింట్‌కు రూ.75 చొప్పున కోతలు విధిస్తుండగా.. ప్రైవేట్‌లో మాత్రం పత్తికి దక్కిన ధరపై కోతలు పెడుతున్నారు. 12తేమ శాతం దాటిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు ధరల్లో కోతలు పెడుతూ.. కొనుగోలు చేస్తున్నారు. కానీ గంటల వ్యవధిలోనే తమే శాతం మారిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పత్తి బండ్లలో ఒకరకమైన తేమ, ఖాళీ చేసిన తర్వాత మరో రకమైన తేమ రావడంతో ధరల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. 13తేమ శాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేసుకుంటున్నారు. అదే పత్తిని జిన్నింగ్‌లకు తీసుకెళ్లిన తర్వాత ఖాళీ చేయడంతో 12శాతానికి పడిపోతోంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఒక శాతం తేమ అధికంగా ఉన్న సీసీఐ కొనుగోలు చేస్తే నష్టమేమీ ఉండదంటున్నారు. 8తేమ శాతం ఉన్న పత్తికి రూ.7521 ధర పలుకగా.. అదే 16 తేమ శాతం ఉన్న పత్తికి రూ.6560 ధర పలుకుతోంది. అంటే 8 పాయింట్లకు క్వింటాలుకు రూ.వెయ్యి వరకు రైతులు నష్టపోతున్నా రు. ఒక్క రోజు 10 క్వింటాళ్ల పత్తిని విక్రయించిన రైతుకు రూ.10వేల వరకు నష్టం వాటిల్లుతోంది. ఇలా నిత్యం రైతులు వేల క్వింటాళ్ల పత్తిని విక్రయించడంతో కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు తేలికగానే

(మిగతా 6వ పేజీలో...)

● ఆదిలాబాద్ మార్కెట్‌లో తూకం వేస్తున్న పత్తి బండి





గిరిజన చిత్రకారుడు ఆనంద్‌రావును సన్మానిస్తున్న పీవో

రాష్ట్రపతి అవార్డు అందుకున్న చరిత్రకారుడికి పీవో అభినందన

ఉట్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) సంకల ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనలు రాష్ట్రపతి అవార్డు అందుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఆదివాసీ గిరిజన చిత్రకారుడు మడావి ఆనందరావును ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఘనంగా సన్మానించారు. మండలకేంద్రంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. గోండు చిత్రకళాకారులు ముడావి రాజేశ్వర్, మనవి ఆనంద్ రావులు ఉమ్మడి జిల్లాలోని జైనూరు మండలం రాసంబిడ్డ గ్రామానికి చెందిన వారని అన్నారు. ఐటీడీఏ, ఆసిఫాబాద్ డీఎఫ్‌లో సహకారంతో గోండ్ చిత్రకారులు న్యూఢిల్లీలో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో అత్యున్నత ప్రతిభ కనబరిచారని, దీపావళి పండుగ ఇతిహాసాన్ని వివరించినందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు లభించింది అన్నారు. గుస్సాడి పెయింటింగ్, తులం కొడుతున్న పెయింటింగ్, ఎగ్మోసూరు పెయిన్ సంస్కృతి సంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు వేసిన చిత్రాలకు రాష్ట్రపతి అభినందించారన్నారు. ఇందులో పీవీటీజీ ఏపీవో మేస్రం మనోహర్, వైటీసీ జేడీఎం నాగభూషణం, మడావి రాజేశ్వర్‌లున్నారు.

పొరపాట్లు లేకుండా సమగ్ర సర్వే

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- తాంసి(కె)లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన
- సర్వే పకడ్బందీగా చేపట్టాలి : డీఎల్పీవో

భీంపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాంసి(కె) గ్రామంలో శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లా రాజర్షిషా పరిశీలించారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇళ్ల జాబితా సర్వేలో ఇంటింటికీ అతికిస్తున్న స్టిక్కర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క నివాస గృహం మినహాయించకుండా పక్క పరిశీలనతో హౌస్ లిస్టు తయారు చేయాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇండ్ల జాబితా పక్కాగా రూపొందుతున్న సర్వే సమగ్రంగా ఉంటుందన్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజులలోగా హౌసింగ్ లిస్టు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే ఇంటింటికి సమగ్ర సర్వేపై ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బక్కి భోజన్న యాదవ్, కునర్పు వినోద్, వైద్య భుజంగ్‌రావులు కలెక్టర్‌కు రోడ్డు అధ్వానంగా ఉందని ఆర్టీసీ అధకిఆరులు బస్సు నడుపుతలేరని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరణ కోరారు. పక్షం రోజులలోగా రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆర్టీసీ అధికారులు పునరుద్ధరిస్తామని కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నలంద ప్రియ, ఐకేపీ ఏపీవో ప్రసాద్, కార్యదర్శి జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాందాస్, తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో ఫణీంధర్

● సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సిరికొండ(ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్పీవో ఫణీంధర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో సిరికొండ, పొన్న, రాంపూర్ గ్రామాల్లో ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సంబంధితశాఖల సిబ్బందిచే సర్వే చేపట్టే నివాసాల ఇంటింటికీ వెళ్ళి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇంటింటి సర్వేలో కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1 నుంచి 3 వరకు నివాసాలు గుర్తించి స్టిక్కర్లు అతికించాలని, 6 నుంచి 18 వరకు సర్వే చేపట్టాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ప్రతీ రోజూ 15 నుంచి 25 కుటుంబాలను సర్వే చేయాలన్నారు. సర్వే చేసే ప్రాంతాల సమాచారం ముందుగానే ప్రజలకు అందించి, ఆధార్, రేషన్ కార్డు, ధరణి పుస్తకాలతో సిద్ధంగా ఉండేలా ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం సర్వే వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖల సిబ్బందికి సూచించారు. ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 18 వరకు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, డీటీ ఉపేందర్, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



తాంసి(కె)లో ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

● విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సామాజిక విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ కుల అంశాలపై నిర్వహించే సర్వేకు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీఏ పీడీ సాయన్న సూచించారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసిన ఇళ్ళకు స్టిక్కర్‌ను అంటించాలన్నారు. సర్వేను ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● బోథ్‌లో ప్రారంభమైన ఇంటింటి సర్వే

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంటింటి సర్వే ప్రారంభమైంది. సర్వేలో 132 మంది శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు. ముందుగా ఇంటిని గుర్తించి అందుకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాలను ఇంటింటా అతికిస్తున్నారు. మొదటిరోజు శుక్రవారం ప్రత్యేక అధికారి వాజీద్‌అలీతో పాటు తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎంపీడీవో జీవన్‌రెడ్డిలు కలిసి ఈనెల 6 నుంచి సర్వే ప్రారంభించనున్నారు. సర్వే అధికారులకు అందరూ సహకరించాలని కోరారు.



అందూర్ గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ఆదివాసీలకు దీపావళి పెద్ద పండుగ

బోథ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలమైన మనకు దీపావళి పండుగ ఎంతో గొప్పదని, ఈ పండుగతో మనకు విడదీయరాని అనుబంధం ఉందని ఎంపీ జి.నగేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అందూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు ప్రాచీన కాలం నుంచి ఆచరిస్తున్న గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ఆదివాసీలం ఈ పండుగను భావితరాలకు అందించాలని సూచించారు. నియమ నిబంధనలు, నిష్ఠ పద్ధతితో జరుపుకునే పండుగ దీపావళి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోరే రవీందర్, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం.రాజేశ్వర్, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ పెందుర తులసిరం, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, గూడెం జుగాది రావు, మురళీధర్‌రెడ్డి, విజయ్, మురళీ, విష్ణుపాటి, సుభాష్, సూర్య, పలువురు బీజేవైఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఈ-చలాన్ల బాదుడు

- ఒకే వాహనానికి రెండు సార్లు జరిమానా
- ఇష్టారాజ్యంగా ఫైన్‌లు వేస్తున్న పోలీసులు
- లబోదిబోమంటున్న వాహనదారులు

7

జిల్లాలో ఘనంగా దీపావళి వేడుకలు

● వాడవాడలా లక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు

ఉట్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి పండుగను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో ప్రముఖులు పాల్గొని లక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. దీనిలోభాగంగా ఉట్నూర్ మండలంలో గురువారం లక్ష్మిపూజలు నిర్వహించుకోగా.. తిరిగి శుక్రవారం కూడా దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. లక్ష్మిపూజలు పురస్కరించుకుని వ్యాపార సంస్థలతో పాటు ఇళ్లను కూడా అలంకరించుకుని ఘనంగా లక్ష్మీపూజలు నిర్వహించుకున్నారు. ఏడాదికోసారి వ్యాపార సంస్థల్లో లక్ష్మిపూజలు నిర్వహించుకోవడం అనవాయితిగా వస్తుంది. వ్యాపారులందరు గురువారం లక్ష్మిపూజల కోసం వ్యాపార సంస్థలను అరటి కొమ్మలతో అలంకరించి మామిడి ఆకుల తోరణాలు కట్టి రంగు రంగుల విద్యుత్ దీపాలను పేర్చి సుందరంగా తయారు చేసుకుని పూజరుల ఆధ్వర్యంలో లక్ష్మిపూజలు నిర్వహించుకున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తన పిల్లలతో కలిసి స్వగ్రామమైన కల్లూరిగూడకు చేరుకుని కుటుంబ సభ్యుల మధ్య దీపావళి ఉత్సవాలు నిర్వహించుకున్నారు. దీపావళి ఉత్సవాలలో భాగంగా తమ పాడి పశువులను సైతం ఆదివాసులు దేవతలుగా భావించి పూజలు నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే సైతం తమ గ్రామంలోని ఇంటి వద్ద ఉన్న పాడి పశువులకు ఎడ్లకు పూజలు నిర్వహించి నమస్కరించారు. గిరిజన గూడాలలో ఈ సందర్భంగా దండారి ఉత్సవాలు నిర్వహించుకున్నారు.

● వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పూజలు

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం దీపావళి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సోనాల, బోథ్, కౌటా(బి), దన్నూర్ గ్రామాలలో వేద పండితుల ఆశీర్వచనాలతో ప్రజలు, వ్యాపార సంస్థల వారు పండుగ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. బోథ్‌లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక సీఐ రమేష్, ఎస్ఐ ప్రవీణ్‌లు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వ్యాపార వర్గాల వారు తమతమ దుకాణాలను విద్యుత్ బల్బులతో పాటు రకరకాల పూలతో తోరణాలుగా అలంకరించి పూజలు నిర్వహించారు.



పాడి పశువులకు పూజలు చేసి మొక్కుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

● గిరిజన తండాల్లో గోదాన్ పూజలు

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): దీపావళి సంబరాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన తాండాల్లో దీపావళి మరుసటి రోజు నిర్వహించే గోదాన్ పూజలు శుక్రవారం గిరిజనులు సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. పండుగను పురష్కరించుకోని దుకాణ సముదాయాల్లో లక్ష్మీపూజ కార్యక్రమాలు నిర్వహించగా, నివాస గృహాల్లో నోము కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన తండాల్లో లంబాడ(బంజార) కుటుంబాల్లో పెళ్లికాని యువతులు ఉదయం అడవులలోకి సాంప్రదాయ పాటలు పాడుకుంటు వెళ్లి వివిధ రకాల పూలను పేకరించి గ్రామంలో గల ప్రతి ఇంటి ముందర ఆవు పేడతో గోదాన్ తయారు చేసి పూలతో ఆలంకరించి పూజించారు. గిరిజనులు గురువారం లక్ష్మీపూజ అనంతరం పేళ్ళికాని యువతులు మంగళహారతులతో ప్రతి ఇంటికి వేళ్ళి గోమాతకు దీపాలతో పూజించారు. ఈ సందర్భంగా కుటుంబ పెద్ద యువతులకు మేరా రుపంలో కట్నకానుకలు ఇచ్చుకున్నారు. శుక్రవారం గ్రామ పెద్ద ఇంటివద్ద యువతులకు సాముహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బోథ్‌లో టపాసులు కాలుస్తున్న వ్యాపారులు

దండారీ చెక్కుల పంపిణీలో రాజకీయ రగడ



● బేలలో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

6 లో